# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వికసిత భారత్ లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా లోక్ సభ సభ్యులందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ తొలి మంత్రిమండలి సమావేశం ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగింది.
- ❖ ఇటీవల ఎన్నికైన లోక్ సభ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నూతన పార్లమెంట్ భవనంలో ఈరోజు ప్రారంభమయ్యింది.
- ❖ రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రంలో కొన్ని చోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

========================

వికసిత భారత్ - 2047 లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా సభ్యులందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. లోక్ సభ సభ్యుల ప్రమాణస్వీకారం సందర్భంగా ఈరోజు ఉదయం పార్లమెంట్‌కు చేరుకున్న ప్రధానమంత్రికి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్వాగతం పలికారు. అనంతరం ప్రధానమంత్రి పార్లమెంట్ ప్రాంగణంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ ప్రజాస్వామ్య పార్లమెంటరీ చరిత్రలో ఇదో అద్భుతమైన రోజని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం నూతన పార్లమెంట్ భవనంలో జరుగుతుందని అన్నారు. ఈ శుభ సమయాన కొత్తగా ఎన్నికైన సభ్యులకు స్వాగతాభినందనలు తెలియజేశారు. ప్రజలు మా విధానాలను విశ్వసించారని, దేశానికి మూడోసారి సేవ చేసే భాగ్యాన్ని కల్పించారన్నారు. సరికొత్త విశ్వాసంతో ఈరోజు కొత్త సమావేశాలు ప్రారంభిస్తున్నామని, రాజ్యాంగాన్ని గౌరవిస్తూ కొత్త నిర్ణయాలు తీసుకుంటామని నరేంద్ర మోదీ తెలియజేశారు.

========================

ఆంధ్రప్రదేశ్ తొలి మంత్రిమండలి సమావేశం ఈరోజు వెలగపూడిలోని సచివాలయంలో జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా చేసిన 5 సంతకాలకు మంత్రిమండలి ఈరోజు ఆమోదం తెలిపింది.

మంత్రిమండలి సమావేశంలో ఆమోదించిన అంశాలపై రాష్ట్ర సమాచార, ప్రసారాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి ఈరోజు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మెగా డీఎస్సీ ద్వారా 16 వేల 347 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి మంత్రిమండలి ఆమోదం తెలిపిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేశామని, రైతులందరికీ ఒరిజినల్ డాక్యుమెంట్లు ఇస్తామన్నారు. అలాగే 3 వేల నుంచి 4 వేల రూపాయలకు పెంచిన పింఛను మొత్తాన్ని జులై 1 నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు. పేదవాడికి నాణ్యమైన భోజనం అందించేందుకు 183 అన్న క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభిస్తామన్నారు. వైద్యులు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు "వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ" పేరును "ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ"గా మార్చామన్నారు. రాష్ట్రంలో నైపుణ్య గణన కార్యక్రమానికి, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను నియమిస్తూ... మంత్రిమండలి ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి వివరిస్తూ.....

(వాయిస్ 30 సెకన్లు)

========================

ఇటీవల ఎన్నికైన లోక్ సభ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నూతన పార్లమెంట్ భవనంలో ఈరోజు ప్రారంభమయ్యింది. ఉదయం 11 గంటలకు 18వ లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్.. సభ్యులతో ప్రమాణస్వీకార కార్యక్రమం చేపట్టారు. తొలుత లోక్ సభాపక్ష నాయకునిగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేత ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం కేంద్రమంత్రులు, ఇతర సభ్యులతో ప్రొటెం స్పీకర్ లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేయించారు. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. మంత్రిమండలి సభ్యుల ప్రమాణం పూర్తయిన తర్వాత ఆంగ్ల అక్షరమాల క్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఎంపీలు ప్రమాణం చేశారు. తొలి రోజు 280 మంది ఎంపీలు ప్రమాణం చేయగా, మిగిలిన వారితో రేపు ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం స్పీకర్ ఎన్నికకు నామినేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. 26వ తేదీన స్పీకర్ ఎన్నిక పూర్తవుతుంది.

విరామం

========================

నైరుతి రుతుపవనాలు రాష్ట్రమంతటా విస్తరించాయి. వీటి ప్రభావంతో రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రేపు, ఎల్లుండి కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. నిన్న తిరుపతి, అల్లూరి సీతారామరాజు, అనంతపురం, కర్నూలు, అన్నమయ్య జిల్లాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా శ్రీకాళహస్తిలో 62.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

========================

బ్రిటీషు వారు తమకు అనుకూలంగా రూపొందించిన చట్టాలకు కాలం చెల్లిందని, కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నూతన నేర న్యాయ చట్టాలను స్వాగతిస్తున్నామని తిరుపతికి చెందిన ప్రముఖ న్యాయవాది సామంచి శ్రీనివాస్ అన్నారు. ఈరోజు ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ... ఆధునిక సమాజంలో నేరాలకు సంబంధించి గత చట్టాల వల్ల విచారణలోను, న్యాయంలోను ప్రజలకు తీవ్ర జాప్యం జరిగేదన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని మూడు నూతన నేర న్యాయ చట్టాలను జులై 1వ తేదీ నుంచి కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతోందన్నారు. ఈ చట్టాలు ప్రజలతో పాటు న్యాయవాదులు, పోలీసులకు కూడా ఎంతో మేలు చేస్తాయని తెలియజేస్తూ.....

(వాయిస్ 36 సెకన్లు)

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులో మాట" కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి "మన్ కీ బాత్" కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28వ తేదీ లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ ద్వారా లేదా, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే "జాతీయ లోక్ అదాలత్"లను కక్షిదారులు తమ కేసుల పరిష్కారానికి వినియోగించుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం 11వ అదనపు న్యాయమూర్తి షేక్ సికిందర్ భాషా కోరారు. తాడేపల్లిగూడెంలో ఆయన ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ... రాజీ మార్గమే రాజమార్గమనే నినాదంతో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 29వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ లో రాజీ చేసుకోదగిన కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలని సూచించారు. తాడేపల్లిగూడెం పరిధిలో ఉన్న 5 న్యాయస్థానాల్లో పెండింగ్ లో ఉన్న కేసుల్లో రాజీ తెలుసుకోదగిన కేసులను గుర్తించామన్నారు. రాజీ చేసుకోవడం వల్ల నగదు, సమయం ఆదా అవడంతో పాటు మనశ్శాంతి లభిస్తుందని న్యాయమూర్తి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) యూనిట్లకు ప్రయోజనం కలిగిస్తూ బడ్జెట్ లో ప్రాధాన్యం కల్పించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కి కోరామని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ (ఫ్యాప్సియా) అధ్యక్షులు వాసిరెడ్డి మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 21వ తేదీన ఢిల్లీలో జరిగిన 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుండి ఫ్యాప్సియా తరుపున హాజరు అయ్యానన్నారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈలకు లబ్ధి చేకూరేలా ఇన్ఫుట్ క్రెడిట్ ట్యాక్స్ విషయంలో మార్పులు చేయాలని ఆర్థిక మంత్రిని కోరామని తెలిపారు. పోలవరం, అమరావతి నిర్మాణంలో ఎం.ఎస్.ఎం.ఈ.ల పాత్ర కీలకమైనది కాబట్టి జీఎస్టీ పన్ను రేట్లు కూడా తగ్గించాలని కోరామన్నారు. ఈ నెల 27వ తేదీన ఎంఎస్ఎంఈ దినోత్సవం సందర్భంగా విజయవాడలో సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి రాష్ట్రం నలమూలల నుండి ఎంఎస్ఎంఈ యూనిట్ల ప్రతినిధులు, అధికారులు హాజరవుతారని మురళీకృష్ణ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన ఖనిజ సంపదను ప్రజా శ్రేయస్సు కోసం సద్వినియోగం చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈరోజు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 2022వ సంవత్సరం నుంచి పెండింగ్ లో ఉన్న ఓఎన్జీసి పెట్రోలియం మైనింగ్ లీజు పునరుద్ధరణ దస్త్రంపై తొలి సంతకం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పురుషుల టీ-20 ప్రపంచ కప్ సూపర్-8 లో భాగంగా భారత్ ఈరోజు చివరి మ్యాచ్ ఆస్ట్రేలియాతో ఆడనుంది. వెస్టిండీస్ లోని సెయింట్ లూసియా వేదికగా ఈరోజు రాత్రి 8 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =